

# ఇదేమి చోద్యం..

- ఒకరి ఇంటి నెంబర్ మరోకరికి కేటాయింపు
- పలుమార్లు గ్రీవెన్స్ లో ఫిర్యాదు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ విభాగం
- బల్దియా అధికారుల వింత పోకడ

8లో..


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 268
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
జూలై 29, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# ఫర్టిలిటీ మాఫియా

- యథేచ్ఛగా ఐవీఎఫ్, సరోగసీ దందా
- త్రినగరిలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న సంతాన సాఫల్య కేంద్రాలు
- ఒక్కొక్కరి నుంచి లక్షల్లో వసూలు
- అధికారుల మౌనం వెనుక ఎన్నెన్నో అనుమానాలు
- సృష్టి ఘటనతోనైనా అక్రమాలకు తెరపడేనా?



సంతానం లేని దంపతులను లక్ష్యంగా చేసుకుని వరంగల్, హనుమకొండ, కాజీపేట త్రినగరిలో ఐవీఎఫ్, సరోగసీ కేంద్రాల దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నాయి. పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వీటిపై అధికారులకు నియంత్రణ కరువైంది. ఎలాంటి అనుమతులు లేకుండానే పలు ఫర్టిలిటీ సెంటర్లు గుట్టుచప్పుడు కాకుండా తమ దందాను కొనసాగిస్తున్నట్లు బహిరంగంగానే చర్చ జరుగుతోంది. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల పనితీరు, వాటిలో జరుగుతున్న అక్రమాలు, అధికారుల అలసత్వంపై ఆరాతీసే అధికారులు కరువయ్యారు. దీంతో త్రినగరిలో ఫర్టిలిటీ మాఫియా పెట్రేగిపోతోంది. అమ్మతనంకోసం ఆశపడుతున్న మహిళలను, వారి భర్తలను భయభ్రాంతులకు గురిచేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. తీరా పిల్లలు పుట్టకపోతే మేం చేయాల్సిందంతా చేశాం కాని దంపతుల శరీర తత్వంతోనే వారికి సంతాన భాగ్యం కలగడం లేదంటూ చావు కబురు చల్లగా చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. అప్పటికే లక్షల్లో ఖర్చు పెట్టుకున్న దంపతులు తాము మోసపోయామని గ్రహించినప్పటికీ బయటికి చెప్పుకోలేక లోలోపలే కుమిలి పోతున్న సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. సికింద్రాబాద్‌లోని 'యూనివర్సల్ సృష్టి ఫర్టిలిటీ సెంటర్' అక్రమాలతోనైన త్రినగరిలోని జరుగుతున్న దోపిడీకి చెక్ పడేనా లేక అవినీతి అధికారుల అండదండలతో యథాతథంగా కొనసాగేనా? – వరంగల్ వాయిస్ హనుమకొండ ప్రతినిధి

వివరాలు2లో..

8లో..



## ఘనంగా నాగుల పంచమి

- ఉర్సు నాగమయ్య గుడికి పోటెత్తిన భక్తులు
- జిల్లా వ్యాప్తంగా వేడుకలు

## స్కూల్ వ్యాన్ ఢీకొని చిన్నారి మృతి

మహదేవ్ పూర్ మండలం అంబటిపల్లిలో ఘటన

2లో..






8లో..

## రుణమాఫీకి సహకరించండి

మంత్రి తుమ్మల, చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శికి వినతి

బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న చేనేత కార్మికులు

# ఫర్టిలిటీ మాఫియా





- యథేచ్ఛగా ఐవీఎఫ్, సరోగసీ దందా
- త్రినగరిలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న సంతాన సాఫల్య కేంద్రాలు
- ఒక్కొక్కరి నుంచి లక్షల్లో వసూలు
- అధికారుల మౌనం వెనుక ఎన్నెన్నో అనుమానాలు
- సృష్టి ఘటనతోనైనా అక్రమాలకు తెరపడేనా?

**వరంగల్ వాయిస్ హనుమకొండ ప్రతినిధి :** వరంగల్, హనుమకొండ, కాజీపేట త్రినగరిలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న సంతాన సాఫల్య కేంద్రాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణ కరువైంది. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల పనితీరు, వాటిలోని అక్రమాలు, అధికారుల అలసత్వంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే పలు ఫర్టిలిటీ సెంటర్లు గుట్టుచప్పుడు కాకుండా తమ దందాను కొనసాగిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో వీర్యం మార్పిడి వ్యవహారం బయటపడినప్పటి నుంచి జరుగుతున్న దర్యాప్తులో విస్తుపోయే నిజాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. అయితే హైదరాబాద్ నగరంలోనే కాక, వరంగల్ నగరంలో కూడా పలు ఫెర్టిలిటీ సెంటర్లలో ఇదే కొనసాగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఈ దందాలో ఒళ్లు గగుర్పొడిచే రహస్యాలు దాగి ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. త్రినగరిలోని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నిజాయితీగా పనిచేస్తే ఎన్నో అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సంతానం లేని దంపతుల బలహీనతను ఆసరాగా చేసుకుని వరంగల్ నగరంలో జరుగుతున్న ఫర్టిలిటీ దందా సమాజంలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఈ కేంద్రాలపై ప్రభుత్వ పర్యవేక్షణ పూర్తిగా లోపించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు తక్షణమే అప్రమత్తమై, సమగ్ర దర్యాప్తు జరిపి ఫర్టిలిటీ, టెస్ట్ ట్యూబ్ సెంటర్ల ముసుగులో జరుగుతున్న ఈ వికృత దందాను బయటకు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వరంగల్ నగరంలో ఇబ్బడిముబ్బడిగా వెలసిన ఈ ఫర్టిలిటీ సెంటర్లలో ఏం జరుగుతుందో వైద్య శాఖ తనిఖీలు చేసి, వాటి అక్రమాలకు అడ్డుకట్ట వేయకపోతే సమాజానికి పెను ప్రమాదం పొంచి ఉంది.

## బిచ్చగాళ్ల నుంచి వీర్యం సేకరణ..

'ఇండియన్ స్పెర్మ్ టెక్ క్రయోసిస్టమ్ క్లినిక్' కేంద్రంగా జరుగుతున్న ఓ దారుణమైన దందా ఇటీవల వెలుగుచూసింది. వీర్యం, అండాల సేకరణలో జరుగుతున్న ఈ అక్రమాలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయి. బిచ్చగాళ్లు, అడ్డా కూలీల నుంచి వీర్యాన్ని సేకరించి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని పోలీసులు గుర్తించారు. పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, ఈ స్పెర్మ్ క్లినిక్‌లు భిక్షగాళ్లకు బిర్యానీ ప్యాకెట్లు, అడ్డా కూలీలకు మద్యం ఇచ్చి వారి నుంచి వీర్యాన్ని సేకరించాయి. చదువుకున్న విద్యావంతుల నుంచి వీర్యం సేకరించడానికి రూ.1,000 నుంచి రూ.4,000 వరకు చెల్లిస్తుండగా, మహిళల నుంచి అండాలు సేకరించడానికి రూ.20,000 నుంచి రూ.25,000 వరకు ఇస్తూ ఈ వికృత దందాను నడిపుతున్నారు.

## నిబంధనలకు పాతర..

వాస్తవానికి, వీర్యం సేకరణకు కఠినమైన నిబంధనలు ఉన్నాయి. ఆరోగ్యవంతులైన వ్యక్తులు, 21 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు వయసున్న వారి నుంచి మాత్రమే వీర్యాన్ని సేకరించాలి. అంతేకాదు, వీర్యం సేకరించే ముందు వారికి 30నుంచి 40 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఎలాంటి జన్యు వ్యాధులు లేదా అంటు వ్యాధులు లేవని నిర్ధారించుకున్న తర్వాతే ఈ ప్రక్రియ చేపట్టాలి. ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఒక దాత నుంచి గరిష్ఠంగా 25 సార్లు మాత్రమే వీర్యాన్ని సేకరించాలి అని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అదే విధంగా ఫెర్టిలిటీ కేంద్రాలు ఒక దాత నుంచి సేకరించిన వీర్యాన్ని ఒక మహిళకు ఒకసారి గర్భధారణకు మాత్రమే ఉపయోగించాలి. అయితే, ఇండియన్ స్పెర్మ్ టెక్ క్రయోసిస్టమ్ క్లినిక్ ఈ నిబంధనలను ఉల్లంఘించి, ఒకే వ్యక్తి నుంచి వారానికోసారి చొప్పున వీర్యాన్ని సేకరిస్తున్నట్లు సమాచారం.

## ఓరుగల్లులో గుట్టుగా..

చాలా ఏళ్లుగా సంతానం కోసం ఎదురుచూసి, చివరి ప్రయత్నంగా ఫర్టిలిటీ, టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లను ఆశ్రయిస్తున్న దంపతుల ఆశలను త్రినగరిలోని కొందరు సంతాన సాఫల్య కేంద్రాల యజమానులు గుట్టుగా సొమ్ము చేసుకుంటున్నారు. 'మీకు పిల్లలను పుట్టించే బాధ్యత మాది' అంటూ వారిలో ఆశలు రేపి, అందినకాడికి దండుకుంటున్నారు. ఇటీవలి కాలంలో వరంగల్‌లో పదుల సంఖ్యలో ఫర్టిలిటీ సెంటర్లు పుట్టుకొచ్చాయి. దీని వెనుక పెద్ద మాఫియా పన్నాగం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పిల్లలు లేని దంపతుల ఆర్థిక స్థోమతను బట్టి, వారి నుంచి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దందా తీరు చూస్తుంటే విస్మయం కలుగుతోంది. కొందరు దంపతులు తమకు సంతానం కలిగితే చాలు, ఎంత డబ్బైనా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. అలాంటి వారి ఆశలను ఆసరాగా చేసుకుని ఫర్టిలిటీ సెంటర్లు తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నాయనే చర్చ నడుస్తోంది.

## అధికారుల నియంత్రణేదీ..?

వరంగల్, హనుమకొండ, కాజీపేటతోపాటు పలు మండల కేంద్రాల్లో పుట్టుకొచ్చిన ఫర్టిలిటీ, టెస్ట్ ట్యూబ్, ఐవీఎఫ్ సెంటర్లలో ఏం జరుగుతుందో కనీసం జిల్లా వైద్య శాఖ అధికారులకే తెలియకపోవడం ఈ దందా ఏ స్థాయిలో కొనసాగుతుందో స్పష్టం చేస్తోంది. నిత్యం తనిఖీలు చేసి, అక్రమాలకు చెక్ పెట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండటంతో ఫర్టిలిటీ సెంటర్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఐవీఎఫ్, సరోగసీ ప్రక్రియలు నిబంధనల మేరకే జరుగుతున్నాయా లేదా అనే విషయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన జిల్లా వైద్య శాఖ వాటి జోలికే వెళ్లకపోవడం విడ్డూరంగా ఉంది. అయితే అధికారుల అండదండలతోనే సంతాన సాఫల్య కేంద్రాలు తమ దందాను కొనసాగిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. త్రినగరిలోని సంతాన సాఫల్య కేంద్రాలు వైద్య శాఖ అనుమతులతోనే పనిచేస్తున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాసుల వేటకై మానవత్వాన్ని మరిచి ఇష్టారీతిగా ఫర్టిలీటి సెంటర్లు వ్యవహరిస్తూ సభ్య సమాజం తలదించుకునేలా చేస్తున్నాయనేది చేదు వాస్తవం.

# స్కూల్ వ్యాన్ ఢీకొని చిన్నారి మృతి

## మహదేవ్ పూర్ మండలం అంబటిపల్లిలో ఘటన

**వరంగల్ వాయిస్, మహదేవ పూర్ :** ప్రైవేట్ స్కూల్ వ్యాన్ ఢీకొని చిన్నారి మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్ పూర్ మండలం అంబటిపల్లిలో మంగళవారం ఉదయం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు అంబట్ పల్లె గ్రామానికి చెందిన సింగనేని మల్లేశ్–భాగ్య దంపతుల కూతురు శ్రీ హర్షిని(3). సూరారం గ్రామంలోని ఎస్ఎస్ వీఎం స్కూల్లో చదువుతున్న తన అన్నను స్కూల్ వ్యాన్ ఎక్కిద్దామని తన తల్లితో కలిసి వ్యాన్ వద్దకు రాగా ప్రమాదవశాత్తు అదే స్కూల్ వ్యాన్ కింద పడిపోయింది. దీంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. స్కూ ల్ వ్యాన్ డ్రైవర్ అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగిందంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహదేవపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చిన్నారి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

# సర్టిఫికేట్ల తయారీ ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో 15 మంది
- పరారీలో మరో ఐదుగురు
- వివరాలు వెల్లడించిన సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా
- ప్రభుత్వ ఖజానాకు భారీ గండి




**వరంగల్ వాయిస్, క్రైం :** రెండు వేర్వేరు సంఘటనల్లో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగిస్తూ బోగస్ వాహన రిజిస్ట్రేషన్, ఇన్సురెన్స్ సర్టిఫికేట్లను తయారు చేసున్న రెండు ముఠాలకు సంబంధించిన 15 మంది కేటుగాళ్లను టాస్క్ ఫోర్స్, హనుమకొండ, మిల్స్ కాలనీ, కేయూసీ పోలీసులు, ఆర్టీఏ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా తెలిపారు. మరో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. పట్టుబడిన నిందితుల నుంచి ఆరు డెస్క్ టాప్ కంప్యూటర్లు, రెండు ల్యాప్ టాప్ లు, రెండు థర్మల్ ప్రింటర్స్, 17 సెల్ ఫోన్లతో పాటు కంప్యూటర్ చిప్ తో కూడిన పీవీసీ కార్డులు, కార్డు ప్రింటింగ్ కు అవసరమైన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో హనుమకొండకు చెందిన ఎండి.ఆసిఫ్ ఖురేషి, వడ్లకొండ శ్రీనివాస్, లేబర్ కాలనీకి చెందిన ఎండి.నవాబ్, ఎల్.బి నగర్ కు చెందిన ఎండి.సాబీర్, హనుమకొండ నయీంనగర్ కు చెందిన మణికంటి ప్రభాకర్ రెడ్డి, కాపువాడకు చెందిన గుగ్గిళ్ళ చెర్రిబాబు, గుడిబండల్ కు చెందిన కెషోజు రాజ్ కుమార్ అలియాస్ డీఎల్ రాజు, ధర్మసాగర్ కరుణాపురంకు చెందిన ఎండి.ఆసిఫ్, ధర్మసాగర్ కు చెందిన అంకం శ్రీనివాస్, హనుమకొండ సుధానగర్ కు చెందిన గౌనెల రమేష్ అలియాస్ వాగ్దేవి రమేష్, ఖిలా వరంగల్ కు చెందిన ఎన్.శశివర్ధన్, కరీమాబాద్ కు చెందిన నరిశెట్టి రాజేష్, శాయంపేటకు హవేలి, గీసుగొండ చెందిన తండ దిలిప్ కుమార్, నక్కలపల్లి కి చెందిన ముజ్జిగ ఓంప్రకాశ్, ఫాతిమానగర్ కు చెందిన ముషిపట్ల అక్షయ్ కుమార్ అను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితులు లక్ష్మమ్మ, సతీష్, వేల్పుల ప్రశాంత్, దేవులపల్లి శ్రావణ్, మామిడి రాజు @ భూపాలపల్లి రాజుగా గుర్తించారు. పట్టుబడిన నిందితుల్లో అధికశాతం ఆర్టీఓ బ్రోకర్లు, వాహన కన్సల్టెన్సీ యజమానులేనని సలీమా పేర్కొన్నారు. రెండు వేర్వురు సంఘటనల్లో హనుమకొండ పోలీసులు ఆరుగురుని అరెస్టు చేయగా, మిల్స్ కాలనీ పోలీసులు మరో ఆరుగురుని, కేయూసీ పోలీసులు ముగ్గురుని అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా తెలిపారు. ఈ రెండు సంఘటనల్లో నిందితులు బోగస్ రిజిస్ట్రేషన్ కార్డ్స్, బోగస్ బీమా పత్రాలను అందజేయడం ద్వారా పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారని పేర్కొన్నారు. అలాగే ఆర్టీఓ విభాగానికి సంబంధించి ఎవరైన ఉద్యోగులు నిందితులకు సహకరించానే కోణంపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు. కాగా నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచన వరంగల్ ఏసీపీ శుభంప్రకాశ్, హనుమకొండ ఏసీపీ నర్సింహరావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూధన్, ఇన్స్‌స్పెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, శ్రీధర్, బాబులాల్, పవన్ కుమార్, కేయూసీ, మిల్స్ కాలనీ, హనుమకొండ ఇన్స్‌స్పెక్టర్లు రవికుమార్, రమేష్, శివకుమార్ తో పాటు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బందిని సలీమా అభినందించారు.

# ఉప్పల్ రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనుల పరిశీలన

## ● నిర్మాణ పనుల్లో కదలిక కాంగ్రెస్ ఆందోళనల ఫలితమే



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం స్టేట్ హైవే రోడ్డుపై ఉప్పల్‌లో నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ఆర్వోబీ) పనులను కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, మాజీ మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు తడక శ్రీకాంత్, మాట్ల రమేష్,యు కాంగ్రెస్ బృందం మంగళవారం సందర్శించి పరిశీలించింది. గత ఆరు సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఈ ఆర్వోబీ నిర్మాణ పనులు నత్తనడకతో సాగడం వల్ల రైల్వే గేట్ వద్ద ప్రయాణికులు గంటల తరబడి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ ఆర్వోబీ అసంపూర్తి నిర్మాణం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి, మారపల్లి మహేష్, వాసాల శ్రీనివాస్, మొండెదల నాగరాజులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను నిలదీశారు. దీని ఫలితంగానే ఆయన దృష్టి సారించి ఆర్వోబీ నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించారని కాంగ్రెస్ బృందం పేర్కొంది. రైల్వే శాఖ అధికారులు, నిర్మాణ కాంట్రాక్టర్ ఈ ఆర్వోబీ పనులు మొత్తం ఒక నెల రోజులలోపు పూర్తవుతాయని చెప్పినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ ఆర్వోబీ నిర్మాణ పనుల్లో కదలిక రావడానికి కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాలే సంపూర్ణ ఫలితం అని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, ఆకినపల్లి భిక్షపతి, నిగ్గుల లింగయ్య, విష్ణు దాసు వంశీధర్ రావు, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గూడెపు మొగిలయ్య, ఓబీసీ నాయకులు బాలపురి కనకరత్నం, కొండా రమేష్, పోతనవేన రాజ్‌కుమార్, ఇస్తారి, పాక చంద్రమౌళి, మిట్టపల్లి కుమార్, పూదరి రమేష్, ఏంబాడీ తేజ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ సీఏపై వరంగల్‌లో ఫిర్యాదు

## నిధుల దుర్వినియోగం ఆరోపణలు




**వరంగల్ వాయిస్, పరకాల:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మోహన్ రావు, వరంగల్ జిల్లా కార్యదర్శి చి. శ్రీనివాస్‌లపై సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి జయపాల్ కలిసి సుబేదారి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఈ ఫిర్యాదును అందజేశారు. ఫిర్యాదులో గత కొన్ని సంవత్సరాలుగా హెచ్ సీఏ ద్వారా వరంగల్ జిల్లాలో క్రికెట్ అభివృద్ధి పేరుతో నిధుల దుర్వినియోగం, మోసపూరిత లావాదేవీలు, అవినీతి జరిగాయని ఆరోపించారు. దీనిపై క్రిమినల్ దర్యాప్తు జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత సాక్ష్యాధారాలు, సీఐడీ నివేదికలు, ఎఫ్ఐఆర్ ప్రతులను కూడా పోలీసులకు సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ "జిల్లా క్రికెట్ అభివృద్ధికి కేటాయించిన నిధులు ఎక్కడా వినియోగించబడ లేదు. ఖాతాల్లో మోసపూరితంగా చూపించి జిల్లాలో అభివృద్ధి జరుగుతుందని పక్కా పథకం ప్రకారం అవినీతి జరిగిందని" ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు త్వరితగతిన విచారణ ప్రారంభించాలని కోరుతున్నారు.

# పర్యావరణ పరిరక్షణకు చెట్లే శరణ్యం



**వరంగల్ వాయిస్, వరంగల్:** పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టడానికి చెట్లే ప్రధాన మార్గమని వరంగల్‌లోని ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన వన మహోత్సవం కార్యక్రమంలో వక్తలు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, చెట్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ రుగ్మతలపై, ముఖ్యంగా పర్యావరణ హితమైన కార్యక్రమాలు నిర్వహించడంలో ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ముందుంటుందని ప్రశంసించారు. ఇందులో భాగంగానే ఈరోజు ఏవీవీ ప్రాంగణంలో సుమారు 20 మొక్కలను నాటినట్లు తెలిపారు. మొక్కలను నాటడం వల్ల ముఖ్యంగా వాయు కాలుష్యాన్ని నియంత్రించవచ్చని, ఇతర కాలుష్యాల నుంచి భావితరాలను కాపాడిన వారమవుతామని ప్రొఫెసర్ నారాయణ అన్నారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం వంటి ప్రత్యేక సందర్భాల్లో ఒక్క చెట్టైనా నాటే మంచి అలవాటును పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భుజంగ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ఏవీవీ ఎన్ఎస్ఎస్ విభాగం అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. డాక్టర్ అనిత, డాక్టర్ శ్రీధర్, చండీశ్వర్, జి. శ్రీనివాస్, డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీనివాస్, సీనియర్ వాలంటీర్లు మన్మిత, చందన, స్వాతి, మినిమం, స్వాతి, మీన్ను, దేవిశ్రీప్రసాద్, సాయి హర్షిత్, రాజ్‌కుమార్, చిరంజీవి, భరత్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి




**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ బృందం కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడింది. అనంతరం ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ మాట్లాడుతూ, కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని, "ఎక్కడ వేసిన గొంగడి అక్కడే" అన్న చందంగా పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.250 మందికి పైగా ఉన్న బాలికలకు కేవలం మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉండటం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. నిర్మాణంలో ఉన్న నూతన భవనం పనులను కాంట్రాక్టర్లు నిలిపివేశారు. ఆంగ్ల సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయుని నియమించకపోవడం సిగ్గుచేటని ప్రశాంత్ అన్నారు. పాఠశాలకు ఐదు అడుగుల ఎత్తులో ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. వాటర్ ట్యాంకులో కోతులు స్నానాలు చేస్తున్నాయని, కనీసం వాటిని శుభ్రం చేసే పరిస్థితి లేదని విద్యార్థులు వాపోయారు. ప్రస్తుతానికైనా ప్రభుత్వం స్పందించి కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నగేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా నాగుల పంచమి వేడుకలు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండల కేంద్రంలోని ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో ఉన్న నాగేంద్ర స్వామి గుడిలో మంగళవారం నాగుల పంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రావణమాసం పురస్కరించుకొని, దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి నాగదేవతల విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి రాజమణి దంపతులు పుట్టలో పాలు పోసి, వెండి నాగమయ ప్రతిమను, వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పుట్టలో పాలు పోసి, భక్తిశ్రద్ధలతో నాగదేవతలను తమ కోరికలు నెరవేర్చాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో భాషని రమేష్, ధనలక్ష్మి, ఇతర మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, హుజూరాబాద్:** అనారోగ్యంతో ఆసుపత్రులపాలై ఇబ్బందులు పడిన లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కులను అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలు, రెండు పట్టణాలకు చెందిన 147 మంది లబ్ధిదారులకు రూ. 51,14,000 విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ, చెక్కులు అందుకున్న వారు త్వరగా బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. చెక్కుల పంపిణీలో అలసత్వం వహిస్తున్నారని ఆరోపిస్తూ బీజేపీ నాయకుడు కౌశిక్ రెడ్డి తన వైఖరిని మార్చుకోవాలని ప్రణవ్ సూచించారు. ప్రోటోకాల్ పేరుతో రెచ్చిపోయే కౌశిక్ రెడ్డి, చెక్కులు ఇచ్చే క్రమంలో సీఎం ఫోటో కట్ చేసి ఇవ్వడం ప్రోటోకాల్ అవుతుందా అని ప్రణవ్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్షులు, మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, దేవస్థాన చైర్మన్లు, సీనియర్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర సందర్శన

## ■ పులుకుర్తి రైతులతో ముఖాముఖి



**వరంగల్ వాయిస్, దామెర:** హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలోని పులుకుర్తి గ్రామంలో వరంగల్ వ్యవసాయ కళాశాల థర్డ్ ఇయర్ విద్యార్థులకు క్షేత్ర సందర్శన, అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. అధ్యాపకులు డాక్టర్ కిషోర్ కుమార్ (వ్యవసాయ విస్తరణ) పర్యవేక్షణలో, మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు పులుకుర్తి గ్రామాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అల్లే రాకేష్ విద్యార్థులకు మండలంలోని ప్రధాన పంటల సాగు పద్ధతులను వివరించారు. ముఖ్యంగా ప్రత్తి, మొక్కజొన్న, వరి వంటి ప్రధాన పంటలను వర్షాకాలం, యాసంగిలో ఎలా సాగు చేస్తారో వివరించారు. విద్యార్థి బృందాలు గ్రామ రైతులతో ముఖాముఖి నిర్వహించి సాగు వివరాలను నేరుగా తెలుసుకున్నారు. రైతులు పండిస్తున్న వివిధ పంటలలో అవలంబిస్తున్న విధానాలు, విత్తన రకాల ఎంపిక, తెగుళ్లు, పురుగుల యాజమాన్యం, ఎరువుల యాజమాన్యంపై ఆరా తీశారు. అంతేకాకుండా, వ్యవసాయ కూలీల లభ్యత, వ్యవసాయ యాంత్రీకరణ, సాగుబడి ఖర్చులు, దిగుబడి అంచనాలను కూడా రైతులతో చర్చించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అధ్యాపకుల బృందం నుంచి డాక్టర్ బి.రాజు (మృత్తికా శాస్త్రం), డాక్టర్ జె. నరేందర్ (ఆగ్రానమీ), డాక్టర్ శివకృష్ణ (వ్యవసాయ విస్తరణ), డాక్టర్ రాంబాబు (హార్టికల్చర్), టి. ఎ. వంశీకృష్ణ , మండల వ్యవసాయ అధికారి అల్లే రాకేష్, వ్యవసాయ విస్తరణ అధికారి వంగర రామకృష్ణ తో పాటు రైతులు కాసెట్టి లక్ష్మణ్, కాసెట్టి రాజు, ముంద్రాతి సర్వేశం, గోపు రమేష్, అంకేశ్వరపు రాంబాబు, తోటకూరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్ స్నేహ శబరీష్



**వరంగల్ వాయిస్, పరకాల:** హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పరకాల పట్టణంలోని పీఏసీఎస్ మాదారం ఎరువుల గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గోదాము రికార్డులను పరిశీలించి, అక్కడ ఉన్న రైతులను యూరియా సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో మాదారం సొసైటీ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి కలెక్టర్‌ను కలిసి, తమ సొసైటీ పరిధిలో ఎక్కువ గ్రామాలు ఉన్నందున అదనంగా 300 టన్నుల యూరియాను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్ జ్యోతి, సీఈఓ రాజేందర్, ఏఈఓ శైలజతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జనగామ విద్యార్థులకు ప్రశంసలు



**వరంగల్ వాయిస్, జనగామ:** భారతరత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జనగామ విద్యార్థులు ప్రశంసలు అందుకున్నారు. కాజీపేటలో నివాసయోగ్యమైన భూమి పరిరక్షణ అనే అంశంపై ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో జనగామ విద్యార్థులు విజేతలుగా నిలిచారని జిల్లా కన్వీనర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పిట్ట సత్యం తెలిపారు. లీడ్ ఫౌండేషన్ గ్లోబల్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో జనగామ జిల్లా నుంచి 48 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 12 మంది విజేతలుగా నిలిచి, రాష్ట్ర కన్వీనర్లు డాక్టర్ పరికిపండ్ల అశోక్, రామలింగారెడ్డి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు.ఈ సందర్భంగా ఉత్తమ సేవలకు గాను డాక్టర్ పి.సత్యంకు 'వింగ్స్ ఆఫ్ ఫైర్ ఎక్సలెంట్ 2025' అవార్డును అందజేశారు. లిబర్టీ ఫౌండేషన్, ఎన్ఎఫ్ఎస్సి, బాలవికాస, రోటరీ క్లబ్ హనుమకొండ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ కార్యక్రమంలో జనగామ విద్యార్థులు విజేతలుగా నిలిచిన సందర్భాన్ని పురస్కరించుకొని పలు విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

# కాళేశ్వరం ఎస్సైకి సన్మానం




**వరంగల్ వాయిస్, మహదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలో ఎంఆర్‌పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) గ్రామ శాఖ అధ్యక్షుడు లేతకారి అవినాష్, కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి, కాళేశ్వర దేవస్థాన చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి లేతకారి మహేందర్, మహాదేవపూర్ మండల అధ్యక్షులు లేతకారి రాజబాబు, చాకినారపు మహేష్, చాకినారపు అశోక్, చాకినారపు శశిందర్ తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం అందించాలి

**◆ జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



**వరంగల్ వాయిస్, ములుగు:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం అందించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావుతో కలిసి ఆయన జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నమోదైన అట్రాసిటీ కేసులు, పరిష్కరించిన కేసులు, బాధితులకు అందిన పరిహారం గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో కేసు పూర్వాపరాలను పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను సందర్శిస్తున్నామని, వాటిలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో బోర్ల మంజూరు అసలైన లబ్ధిదారులకు అందించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మానిటరింగ్ కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ కమ్యూనిటీ భవనం నిర్మించాలని, ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత ఇవ్వాలని సభ్యులు కోరారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరగా, కలెక్టర్ స్పందిస్తూ.. రేపటి సమాజ నిర్మాతలైన యువత డ్రగ్ మహమ్మారి బారిన పడకుండా కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు అన్ని శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా చేసే పాత నేరస్తులపై గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ అన్నారు. డీఎస్పీ కిషోర్ కుమార్ మాట్లాడుతూ, అట్రాసిటీ కేసుల విషయంలో త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎఫ్ఐఆర్, చార్జిషీట్, పరిష్కారం అయిన కేసులు, విచారణలో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మణ్ నాయక్, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జొన్న రవి, సునర్కని రాంబాబు, మురకుంట్ల నరేందర్, చింత కృష్ణ, బానోతు రాము నాయక్, తహసీల్దార్లు, జిల్లా అధికారులు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర నిధులున్నా విడుదల చేయరా?

## నడికూడ మాజీ సర్పంచ్ ఆవేదన



**వరంగల్ వాయిస్, నడికూడ:** జాతీయ ఉపాధి హామీ పథకం కింద కేంద్రం విడుదల చేసిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.1200 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీలకు విడుదల చేయాలని నడికూడ గ్రామ మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు ఎంపీడీవో జీ.విమలకు వినతిపత్రం అందజేశారు. ఈ నిధులను విడుదల చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు. గతంలో గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనుల కోసం మాజీ సర్పంచులు ప్రభుత్వాలను నమ్ముకుని అప్పులు చేసి పనులు చేశారని రవీందర్ రావు గుర్తు చేశారు. అధికారులు ఒత్తిడి తెచ్చి పనులు చేయించినా, కేంద్రం నుంచి రూ.1200 కోట్ల నిధులు వచ్చి నెల రోజులు దాటినా కూడా పంచాయతీరాజ్ మంత్రి సీతక్క గానీ, అధికారులు గానీ వాటిని విడుదల చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కనీసం ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వాన్ని నిలదీయడం లేదని రవీందర్ రావు విమర్శించారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మా రెడ్డి కేటీఆర్ ద్వారా సభలో ఈ అంశాన్ని ప్రస్తావించారని గుర్తుచేశారు. తెలంగాణలోని నియోజకవర్గ ఎమ్మెల్యేలు గానీ, మాజీ ఎమ్మెల్యేలు గానీ, అభివృద్ధి కోసం పనులు చేసి రోడ్డున పడిన మాజీ సర్పంచుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# బాక్సింగ్ ఛాంపియన్ జహీదా తన్వీర్ కు సన్మానం



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట:** హైదరాబాద్‌లో బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన పోటీలలో 30–33 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన బాలిక జహీదా తన్వీర్‌ను న్యూ శాయంపేటలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మామిండ్ల రాజు మాట్లాడుతూ యువత క్రీడల్లో పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొంది, గోల్డ్ మెడల్స్ సాధించాలని ఆయన సూచించారు. క్రీడల్లో రాణించాలనుకునే వారికి తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందని పేర్కొన్నారు. పేదరికంతో పోరాడుతూ, ఆటో డ్రైవర్ అన్వర్ కుమార్తె అయిన జహీదా తన్వీర్ చాలా కష్టపడి ఈ విజయాన్ని సాధించడం తనకు గర్వకారణమని కార్పొరేటర్ రాజు అన్నారు. ఈ బాలికను ఆదర్శంగా తీసుకొని చాలా మంది విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజరాజేశ్వరి ఆటో యూనియన్ అధ్యక్షులు వేల్పుల సాంబమూర్తి, వేల్పుల భిక్షపతి, ఎన్. నరహరి, ఎన్.సంతోష్, టి.తిరుపతి, ఎన్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తిష్ఠ

**◆ ఏఐఎఫ్‌డీఎస్ నేత గడ్డం నాగార్జున**



**వరంగల్ వాయిస్, వరంగల్:** ప్రభుత్వ విద్యా సంస్థలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎఫ్‌డీఎస్ (ఆల్ ఇండియా ఫోరం ఫర్ డెమోక్రటిక్ స్టూడెంట్స్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిర్వహిస్తున్న సర్వేలలో భాగంగా మంగళవారం వరంగల్ కృష్ణ కాలనీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి మాట్లాడుతూ తెలంగాణలో విద్యా సంస్థలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా, కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రభుత్వ విద్యా సంస్థలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తక్షణమే మౌలిక వసతులు కల్పించాలి. వర్షాకాలంలో చాలా హాస్టల్, పాఠశాల భవనాలు కూలిపోయే ప్రమాదం ఉన్నందున వాటిని వెంటనే కూల్చివేసి, నూతన భవనాలను నిర్మించాలి. రూ.8,000 కోట్ల పైచిలుకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ (మండల విద్యాధికారి), డీఈఓ (జిల్లా విద్యాధికారి) పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు అందించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్స్ ఛార్జీలను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఎస్ఎఫ్ఐ హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పొలబోయిన రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

**◆ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పరకాల మున్సిపాలిటీ పరిధిలో జేసీబీ, స్వచ్ఛ ఆటోలను ఆయన ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఒక జేసీబీ, ఆరు స్వచ్ఛ ఆటోలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ స్టాల్స్‌ను, మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన మరియు అమ్మకాల స్టాల్‌ను అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. అంతకుముందు, వన మహోత్సవంలో భాగంగా అధికారులతో కలిసి మొక్కలు నాటి, మున్సిపల్ కార్మిక సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందాల్సిన పరకాల గత పాలకుల వైఖరి వల్ల నిరాదరణకు గురైందని అన్నారు. పరకాల పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కృషి చేస్తున్నానని తెలిపారు. పరకాలలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నామని, త్వరలో సెట్‌విన్ కూడా రాబోతుందని ప్రకటించారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో డీపీఆర్ ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, త్వరలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రూ.40 కోట్లతో డ్రైనేజీ, దాదాపు రూ.11 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రజల సహకారంతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలు పరిశుభ్రత పాటించి పారిశుద్ధ్యాన్ని పరిష్కరించడంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. పరకాలకు పూర్వ వైభవం తీసుకురావడంలో ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గత పాలకుల మోసపూరిత మాటలతో పరకాల పట్టణం వెనుకబడిందని విమర్శించారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి అన్నారు.

# పస్రా సీఐగా పత్తిపాక దయాకర్ బాధ్యతల స్వీకరణ




**వరంగల్ వాయిస్, ములుగు:** ఇటీవల జరిగిన మల్టీ జోన్-1 ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో భాగంగా ములుగు జిల్లా పస్రా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పత్తిపాక దయాకర్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన పస్రా నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌స్పెక్టర్ దయాకర్ హనుమకొండ, కేయూసీ, మల్టీ జోన్ 1 పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో పని చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పత్తిపాక దయాకర్‌కు సిబ్బంది, పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# సాంఘిక సంక్షేమ కళాశాలలో స్పాట్ ప్రవేశాలు



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని ఒగ్గులాపూర్ ఎస్‌బీఐటీ ప్రాంగణంలో ఉన్న పరకాల సాంఘిక సంక్షేమ బాలుర కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో స్పాట్ ప్రవేశాలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్. సమ్మయ్య తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లోని సీట్ల భర్తీకి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని ఆయన వివరించారు. పదవ తరగతిలో 400 మార్కులకు పైన సాధించిన విద్యార్థులు ఈ నెల 31 ఉదయం 9 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు ఫోటోలు, మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో కళాశాలకు హాజరుకావాలని సూచించారు. అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు అర్హుల జాబితాను ప్రకటిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని, ఇతర వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

# రహదారిపై ప్రమాదకరంగా ముళ్లపొదలు



## ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

**వరంగల్ వాయిస్, నడికూడ:** పరకాల-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై పెరిగిన ముళ్లపొదలు ప్రయాణికులకు ప్రమాదకరంగా మారాయి. ముస్త్యాలపల్లి, నడికూడ గ్రామాల మధ్య డివైడర్‌పై, రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు రహదారిపైకి చొచ్చుకు రావడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముళ్ల చెట్లు రోడ్డుపైకి రావడంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఈ ముళ్లపొదలు సరిగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## తక్షణమే తొలగించాలి

**మేకమల్ల వెంకటేష్, ముస్త్యాలపల్లి**

రహదారిపై ఏపుగా పెరిగిన ముళ్లపొదలు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. ముఖ్యంగా రాత్రిపూట ప్రయాణించే భారీ వాహనాలకు ఈ పొదలు సరిగా కనిపించకపోవడంతో భారీ ప్రమాదాలు జరిగే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి, ప్రమాదకరమైన ఈ ముళ్లపొదలను తొలగించాలి. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ విషయంలో అలసత్వం పనికిరాదు.

# ఎన్ హెచ్ఎం ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

**రామ రాజేష్ ఖన్నా డిమాండ్**



**వరంగల్ వాయిస్, వరంగల్:** ఎన్ హెచ్ఎంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని గత మూడేళ్లుగా ఆందోళనలు చేస్తున్నా ఫలితం లేదని ఎన్.హెచ్.ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆవేదన వ్యక్తం చేసింది. జీవో నెంబర్ 60 ప్రకారం నాలుగో తరగతి ఉద్యోగులకు రూ.15,600 రావాల్సి ఉండగా, కేవలం రూ.10,400 మాత్రమే ఇస్తూ అన్యాయం చేస్తున్నారని యూనియన్ పేర్కొంది. ఈ అన్యాయాన్ని నిరసిస్తూ కోఠిలోని ఎన్.హెచ్.ఎం. డైరెక్టర్ కార్యాలయం ముందు జూలై 26న మహాధర్నా నిర్వహించారు. ధర్నా జరిగి మూడు రోజులు అవుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా అన్నారు. ఎన్.హెచ్.ఎం. అధికారులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పట్ల సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నారని ఆయన విమర్శించారు. కొంతమందికి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జీతాలు చెల్లిస్తూ, కింది స్థాయి నాలుగో తరగతి ఉద్యోగుల పొట్ట కొడుతూ శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే జీవో నెంబర్ 1195 ప్రకారం నాలుగో తరగతి ఉద్యోగులకు రూ.15,600 చెల్లించాలని ప్రభుత్వాన్ని రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు.

# మీనాక్షి నటరాజన్ తో నాయిని భేటీ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జ్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జ్‌లుగా నియమితులైన సందర్భంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, పదవుల కేటాయింపు తదితర అంశాలను ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యంగా వరంగల్, కరీంనగర్ జిల్లాల సంస్థాగత నిర్మాణం, పార్టీ పదవులు, డీసీసీ (జిల్లా కాంగ్రెస్ కమిటీ) కమిటీ ఏర్పాటు అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణపై దృష్టి సారించండి

**● జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**



**వరంగల్ వాయిస్, జనగామ:** ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించి, మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత వైద్యాధికారుల మీద ఉందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. మంగళవారం లింగాల గణపురం మండలంలో ఆయన పలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా లింగాల గణపురం పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్, ఓపీ, అటెండెన్స్ తదితర రిజిస్టర్లను పరిశీలించి, సీజనల్ వ్యాధులపై సమీక్షించారు. రాపిడ్ ఫీవర్ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల విషయంలో చిన్న పిల్లల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఓపీ పేషెంట్‌కు ముందస్తుగా పరీక్షలు తప్పకుండా చేయాలని, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా పరీక్షలు జరగాలని స్పష్టం చేశారు. ఫీవర్ సర్వే గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్న ఆయన, టీ-హబ్‌కు వెళ్లే ప్రతి శాంపిల్‌కు సంబంధించిన రికార్డును నిర్వహించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ (లింగాల గణపురం) గైర్హాజరును తీవ్రంగా పరిగణించి, ఆ ఉద్యోగికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు.
అనంతరం జీడికల్ హైస్కూల్‌ను సందర్శించిన కలెక్టర్, టీచర్ల అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించి, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఆ తర్వాత అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. అదే గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. గ్రామ శివారులో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బ్లూ టంగ్ (నీలి నాలుక వ్యాక్సినేషన్) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. పది రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో 1,68,700 గొర్రెలకు టీకా వేయనున్నట్లు తెలిపారు. షీప్ సొసైటీకి కావాల్సిన కనీస అవసరాలను తీరుస్తామన్నారు.చివరగా జనగామలోని ఆగ్రోస్ 3 ఫర్టిలైజర్ షాప్‌ను సందర్శించి, స్టాక్ రిజిస్టర్, అమ్మకాల రిజిస్టర్లను పరిశీలించారు. ఎంత యూరియా నిల్వలు ఉన్నాయో, ఎంత అమ్ముడైందో, ఇప్పటివరకు ఎంత అమ్మారో షాప్ యాజమానిని అడిగి తెలుసుకున్నారు. యూరియా అమ్మకం వివరాలు పక్కాగా ఉండాలని, రైతు ఫోన్ నంబర్‌తో సహా అన్ని సమాచారం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య, విద్యా, పశు వైద్య శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతులకు నిత్యావసరాల పంపిణీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** సనాతన హిందూ సేవా సమితి తమ 93వ సేవా కార్యక్రమాన్ని కాశిబుగ్గలో నిర్వహించింది. ఎలాంటి ఆధారం లేకుండా, ఆరోగ్య సమస్యలతో, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వృద్ధ దంపతులు గుల్లపెల్లి ఈశ్వరమ్మ కుటుంబానికి మంగళవారం రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ వ్యవస్థాపకుడు తాళ్లపెల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, సలహాదారు ప్రతాపగిరి గణేష్, గ్రూప్ సభ్యులు బడుగు రాము, బైరిశెట్టి కార్తీక్, గంగిడి ధర్మారెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్లీడర్ బొట్ల సుధాకర్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, రేగొండ:** స్వయంకృషితో న్యాయ విద్యను అభ్యసించి భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులైన బొట్ల సుధాకర్‌ను మంగళవారం ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఆయనకు అభినందనలు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్ రావు మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టి, న్యాయవాదిగా అకుంఠిత దీక్షతో సేవలందించి ప్రభుత్వ ప్లీడర్ స్థాయికి చేరుకోవడం ఆదర్శనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు మోడెం ఉమేష్ గౌడ్, కాంగ్రెస్ రేగొండ టౌన్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, నాయకులు మైస భిక్షపతి, ముద్దమల్ల రఘు, మేకల భిక్షపతి, ఐలి శ్రీధర్ గౌడ్, గండి తిరుపతి, ఎండీ తాజోద్దీన్, కటకం సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కోటగుళ్లలో నాగ పంచమి వేడుకలు

## భక్తులతో కిక్కిరిసిన ఆలయం



**వరంగల్ వాయిస్, గణపురం:** శ్రావణమాసాన్ని పురస్కరించుకొని కాకతీయుల కళాక్షేత్రం, చారిత్రాత్మక శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్ళ)లో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉదయం గణపతి పూజతో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం నందీశ్వరుడు, గణపేశ్వరునికి పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అభిషేకం తర్వాత స్వామివారిని నాగాభరణం, పట్టు వస్త్రాలు, వివిధ రకాల పూలమాలలతో కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు భవానీ మాతకు తాంబూలాలు సమర్పించి పూజలు చేశారు. తులసి, మారేడు, ఉసిరి, తెల్ల జిల్లేడు, మేడి మొక్కల వద్ద, నాగదేవుని పుట్ట వద్ద దీపాలను వెలిగించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు భక్తులకు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రావణమాసం తొలి సోమవారం కావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది.

# క్రాంతి కుమార్‌కు గోల్డ్ మెడల్



**వరంగల్ వాయిస్, గణపురం:** మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన దళిత బిడ్డ, బీఫార్మసీలో గోల్డ్ మెడల్ సాధించిన కుమ్మరి క్రాంతి కుమార్‌ను అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. సీతారాంపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు, ఎస్సీ దళిత కుటుంబానికి చెందిన కుమ్మరి స్వరాజ్యం, రవిల కుమారుడు అయిన క్రాంతి కుమార్.. హనుమకొండలోని విద్యానగర్‌లో ఉన్న సైంట్ పీటర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ కాలేజీలో 27వ గ్రాడ్యుయేట్ బీఫార్మసీ విద్యార్థిగా బీఫార్మసీ అకాడమిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. అంతేకాకుండా, జీపీఏటీలో ఆల్ ఇండియా 9357వ ర్యాంకు (AIR: 9357) సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు కట్ల శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఆరుముళ్ల స్వామి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఫీట్ల రంజిత్, ఎడ్ల సదానందం, రత్నం రామకృష్ణ, ఈర్ల సారయ్య, ఇనుముల రాజు, గుర్రం భద్రయ్య, రామంచ కిరణ్, ఎలుకపెల్లి రాజు, రామంచ మధుకర్, ఎలుక పెల్లి సుమన్ పాల్గొన్నారు.

# వ్యర్థాల నిర్వహణ, గోదావరి ఉధృతిపై సమీక్ష

- జిల్లాలో కలెక్టర్ రాహుల్ శర్మ పర్యటన




**వరంగల్ వాయిస్, మహదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం ఆకస్మిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన కాళేశ్వరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన వ్యర్థాల దహన వాటికను పరిశీలించి, దహన ప్రక్రియ, నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచే దిశగా ఈ చర్యలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. జ్వరం ప్రబలిన ప్రాంతాల్లో ఇంటింటి జ్వర సర్వే నిర్వహించాలని సూచించారు. వసతి గృహాలు, గోదావరి వద్ద భద్రతపై సూచనలువసతి గృహాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, వారి హెల్త్ ప్రొఫైల్ను నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చికిత్స తీసుకుంటున్న ప్రజలతో మాట్లాడి ఆరోగ్య సేవల గురించి తెలుసుకున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడి ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సరస్వతి ఘాట్ వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించిన కలెక్టర్, నది ఉధృతంగా ప్రవహిస్తోందని, స్నానాలు చేసే భక్తులకు గోదావరిలోకి వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీసు శాఖ నిరంతరం గోదావరి వద్దకు వచ్చే భక్తులపై నిఘా ఉంచాలని, ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే స్పందించాలని ఆదేశించారు. గోదావరి నీటి మట్టం ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తే, తీర ప్రాంత ప్రజలకు తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు వంటి అత్యవసర వనరులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో స్థానిక రెవెన్యూ అధికారులను లేదా కంట్రోల్ రూమ్ 90306 32608 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. పిండ ప్రదానం చేయు భవనాన్ని కూడా అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, ఈఓ మహేష్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి




**వరంగల్ వాయిస్, దామెర:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. మంగళవారం దామెర మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కోగిలవాయి ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 1న ఏకశిలా పార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సోమయ్య, ఆత్మకూరు మండల శాఖ అధ్యక్షులు సత్యనారాయణ, దామెర మండల బాధ్యులు సుదర్శన్, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభానికి సిద్ధమైన పల్లె దావఖాన



**వరంగల్ వాయిస్, దామెర:** హనుమకొండ డీఎం అండ్ హెచ్ఓ అప్పయ్య మంగళవారం దామెర మండలంలోని ఊరుగొండ గ్రామంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పల్లె దావఖానాను (ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం) పరిశీలించారు. ఆయన దావఖానా భవనాన్ని, దాని పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కేంద్రం నుండే అన్ని ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దామెర మెడికల్ ఆఫీసర్ మహేంద్ర, సూపర్వైజర్ శ్రీకాంత్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా నాగుల పంచమి వేడుకలు



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ:** నగరంలో మంగళవారం నాగుల పంచమి సందర్భంగా వివిధ దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కాశీబుగ్గలోని భక్త మార్కండేయ గుడి, ఓసిటిలోని కనకదుర్గ ఆలయం, మరియు కోటిలింగాల దేవాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

# ఊరుగొండ ఆలయంలో బందోబస్తు



**వరంగల్ వాయిస్, దామెర:** దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊరుగొండలో ఉన్న శ్రీ శివ నాగేంద్ర స్వామి ఆలయంలో నాగుల పంచమి సందర్భంగా మంగళవారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో ఎస్సై శ్రీ కొంక అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు తరలిరాగా, వారిని క్రమబద్ధీకరిస్తూ అందరూ ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని, జాతీయ రహదారికి ఇరువైపులా కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేసి, భక్తులు కాలినడకన ఆలయానికి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు సమర్థవంతంగా బందోబస్తు నిర్వహించారు.

# ఎఫ్‌పీఓ సభ్యత్వ నమోదు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో ఈరోజు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) శాయంపేట చైర్మన్ కుసుమ శరత్ ఆధ్వర్యంలో ఎఫ్.పీ.ఓ. (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)లో చేరడానికి చాలామంది రైతులు సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్ తో పాటు డైరెక్టర్లు గంటా జయ శ్యాంసుందర్ రెడ్డి, కందగట్ల ప్రకాష్, మాజీ ఎంపీపీ చిట్టి రెడ్డి జైపాల్ రెడ్డి, పీఏసీఎస్ అధికారులు శంకర్, నాగరాజు, రైతులు బండ జయపాల్ రెడ్డి, పెద్దిరెడ్డి ఆదిరెడ్డి, చిట్టి రెడ్డి ప్రకాష్ రెడ్డి, వైద్యుల లక్ష్మారెడ్డి, చిట్టి రెడ్డి రఘుపాల్ రెడ్డి, వైద్యుల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# మహావతార్ నరసింహ అద్భుతం

**చిత్ర బృందాన్ని మెచ్చుకున్న ప్రభాస్**

ప్రస్తుతం భారతీయ బాక్సాఫీస్ వద్ద పురాణగాథలకు మంచి డిమాండ్ ఉంది. తెలిసిన కథే అయినా ఆసక్తికరంగా తీర్చిదిద్ది అందిస్తే ప్రేక్షకులు ఆదరిస్తున్నారని ఇటీవల పలు సినిమాలు నిరూపించాయి. ఇప్పుడు ఇదే బాటలో పయనిస్తోంది 'మహావతార్ నరసింహ', ప్రముఖ నిర్మాణసంస్థ హోంబలే ఫిల్మ్స్ నుంచి వచ్చిన ఈ విజువల్ వండర్‌కు చిన్నా, పెద్దా అందరూ ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా 3డీలో సరికొత్త అనుభూతిని పంచుతోంది. తాజాగా మూవీని చూసిన అగ్ర కథానాయకుడు ప్రభాస్ చిత్ర బృందాన్ని మెచ్చుకున్నారు. పవర్‌ఫుల్ విజన్‌తో 'మహావతార నరసింహ'ను వాస్తవంలోకి తీసుకొచ్చిన హోంబలే ఫిల్మ్స్‌కు శుభాకాంక్షలు. సినిమా నాకెంతో నచ్చింది. యానిమేషన్ రూపంలో తీర్చిదిద్దిన యాక్షన్ సన్నివేశాలు, కథాగమనం అద్భుతంగా ఉన్నాయి. ఈ అపురూప విజయం సాధించిన దర్శకుడు అశ్విన్‌కుమార్, చిత్ర బృందానికి అభినందనలని పేర్కొన్నారు. ప్రభాస్ పోస్ట్‌కు హోంబలే చిత్రబృందం స్పందించింది. సినిమాపై ఆయన అభిప్రాయంపై కృతజ్ఞతలు తెలిపింది.

# కింగ్డమ్ నుంచి రగిలే రగిలే సాంగ్

**తమిళంలో వాయిస్ ఓవర్ ఇచ్చిన సూర్య**

విజయ్ దేవరకొండ ప్రధానపాత్రలో రానున్న 'కింగ్డమ్' గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కింది. భాగ్య శ్రీ బోర్సే కథానాయికగా కనిపించనున్నారు. జులై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా 'రగిలే రగిలే' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు 'మృత్యువు జడిసేలా.. శత్రువు బెదిరేలా.. పద పద..' అనే పవర్‌ఫుల్ లిరిక్స్‌ను కృష్ణకాంత్ రాయగా.. సిద్ధార్థ్ బస్రూర్ ఆలపించారు. ఈసందర్భంగా చెన్నైలో ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు–చేశారు. అందులో విజయ్ మాట్లాడుతూ హీరో సూర్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టీజర్‌కు వాయిస్ ఓవర్ ఇస్తారా అని అడగ్గానే అంగీకరించారని తెలిపారు.

ఈ

సినిమా విడుదలకు ముందు ముఖ్యంగా ఇద్దరికి కృతజ్ఞతలు చెప్పాలి. వారిలో ఒకరు హీరో సూర్య. నాకు మొహమాటం ఎక్కువ. ఎవరిని సాయం అడగలేను. 'కింగ్డమ్' తమిళ టీజర్‌కు సూర్య వాయిస్ ఇస్తే బాగుంటుందని దర్శకుడు తెలిపారు. నేను ఈ మాట అడగ్గానే సూర్య ఓకే చెప్పారు. ఆయన పవర్‌ఫుల్ వాయిస్ టీజర్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చేసింది. థాంక్యూ సూర్య అన్న అని అన్నారు. ఇక రెండో వ్యక్తి మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్.. అతడు ఈ సినిమాకు ప్రాణం పెట్టాడు. ఇటీ–వల జరిగిన ఈవెంట్‌లో కూడా ఈ చిత్రం మా అందరికీ మైల్‌స్టోన్ అవుతుందని అనిరుధ్ చెప్పాడు. మరో రెండు రోజుల్లో 'కింగ్డమ్' మీ ముందుకురానుంది.



# వార్నర్‌కు బాహుబలి కిరీటం

డేవిడ్ వార్నర్.. క్రికెట్ అభిమానులకే కాదు.. సినీప్రియులకు ఎంతో ఇష్టమైన వ్యక్తి. తెలుగు సినిమా పాటలకు తనదైన □`టస్టైల్‌లో డ్యాన్స్ వేస్తూ అలరిస్తుంటారు. 'బాహుబలి' సినిమాపై ఆయన చేసిన వీడియోలు కూడా అప్పట్లో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. ఇప్పుడీ క్రికెటర్‌కు మన దర్శకధీరుడు రాజమౌళి 'బాహుబలి' కిరీటాన్ని పంపనున్నారు. ఇండియన్ సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది 'బాహుబలి'. ఈ చిత్రం విడుదలై 10 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో దీన్ని మరోసారి ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా డేవిడ్ గతంలో తాను ధరించిన బాహుబలి కాస్ట్యూమ్ లుక్స్‌ను తాజాగా మరోసారి పంచుకున్నారు. 'కిరీటం ఉన్న ఫొటో బాగుందా? లేని పిక్ నచ్చిందా?' అని క్యాప్షన్ పెట్టారు. దీనికి రాజమౌళి రిప్లై ఇచ్చారు. హాయ్ డేవిడ్.. మీరిప్పుడు మాహిష్మతి సామ్రాజ్యానికి నిజమైన రాజులా తయారవ్వండి. నేను ఈ కిరీటాన్ని పంపుతున్నానని అన్నారు. దానికోసం ఎదురుచూస్తుంటానని క్రికెటర్ చెప్పారు. 'మీరు ఆస్ట్రేలియాలో ఈ సినిమాను మరోసారి చూడండి' అని టీమ్ మరో కామెంట్ పెట్టింది. దీనికి వార్నర్ ఓకే అంటూ థంబ్ పెట్టారు. రెండు భాగాలుగా అలరించిన ఈ బ్లాక్‌బస్టర్ ఇప్పుడు ఒకే పార్ట్‌గా రానుంది. 'బాహుబలి: ది ఎపిక్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఇది విడుదల కానున్న విషయం తెలిసిందే.



# సతీలీలావతిగా లావణ్య త్రిపాఠి

లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సతీ లీలావతి' తాతినేని సత్య ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. తాజాగా దీని టీ–జర్‌ను టీ–మ్ విడుదల చేసింది. సోషల్ మీడియాలో వచ్చే కౌంటర్స్, సరదాగా సాగే పంచ్‌లతో ఈ వీడియో నవ్వులు పూయిస్తోంది. మిక్కీ జే మేయర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.




# ఇదేమి చోద్యం..

- ఒకరి ఇంటి నెంబర్ మరొకరికి కేటాయింపు
- పలుమార్లు గ్రీవెన్స్ లో ఫిర్యాదు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ విభాగం
- బల్దియా అధికారుల వింత పోకడ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్ని ఫిర్యాదులు వచ్చినా గ్రేటర్ వరంగల్ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు మారడం లేదు. గ్రీవెన్స్ ఫిర్యాదులను త్వరితగతిన పూర్తి చేయాలన్న ఉన్నతాధికారుల మాటలు నీటి మూటలుగా మారుతున్నాయి. ఇష్టారీతిగా వ్యవహరిస్తూ బల్దియాకు చెడ్డపేరు తెస్తున్నారు. అందుకు సాక్ష్యంగా నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేట పద్మశాలి వీధిలోని ఇంటినంబర్ 19-4-21/ఏ నిలుస్తోంది. ఈ ఇంటి నెంబర్ యజమాని వనం రమణమ్మ. గత కొంత కాలంగా క్రమం తప్పకుండా ఇంటి పన్ను చెల్లిస్తున్నారు. అయితే అక్రమ నిర్మాణదారులపై టౌన్ ప్లానింగ్ అధికారులకు ప్రేమ పుట్టిందో ఏమో? ఇదే ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా జి ప్లస్ వన్ నిర్మిస్తున్న మరో వ్యక్తి ఇదే ఇంటి నెంబర్ ను కేటాయించి తమకు తామే సాటని నిరూపించుకున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతూ కొత్త భవనానికి పాత కలరింగ్ ఇచ్చేందుకు మరొకరి ఇంటి నెంబర్ ను వీరికి కేటాయించడం విడ్డూరంగా మారింది. దీనిపై బాధితురాలు వనం రమణమ్మ బల్దియా గ్రీవెన్స్ లో పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారే కరువయ్యారు. వడ్డించేవాడు మనోడైతే చాలు అన్నట్లుగా అక్రమ నిర్మాణంలో టౌన్ ప్లానింగ్ అధికారుల హస్తం ఉండడంతో వారు పద్మశాలి వీధికి వచ్చింది లేదు.. చర్యలు తీసుకున్నదీ లేదు. దీంతో ఎంతో కాలంగా ఇంటి పన్ను చెల్లిస్తున్న వనం రమణమ్మ లబోదిబోమంటోంది.


వరంగల్ మహానగర పాలక సంస్థ
వరంగల్
రశీదు
సంఖ్య : 50028
తేది : 28/Jul/2025
శ్రీమతి/ శ్రీ VANAM RAMANAMMA ఇంటి నెంబర్ 19-4-21/A నివాసము WARANGAL వరంగల్ గారి నుండి Illegal Construction అర్జీ స్వీకరించడమైనది.
దారఖాస్తుదారుని మొబైల్ నంబర్ 9652350461,సంబంధిత అధికారి పేరు KONDAVENI ANIL KUMAR (TOWN PLANNING SUPERVISOR) అధికారి మొబైల్ నెం 9100908360
సూచన:
1.ఇది కంప్యూటర్ రశీదుకు భౌతిక సంతకం అవసరం లేదు.
పౌరసేవా కేంద్ర సహాయకులు

## మరోమారు ఫిర్యాదు..

తనకు సంబంధించిన ఇంటి నెంబర్ 19-4-21/ఏ ను మరొక అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవనానికి కేటాయించడం బాధితురాలు వనం రమణమ్మ సోమవారం మరోసారి బల్దియా గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. నీతి నిజాయితీకి అద్దం పడుతున్న కమిషనర్ ఈ విషయంలో స్పందించి తనకు న్యాయం చేస్తారన్న ధీమా వ్యక్తం చేస్తోంది. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై కూడా ఆమె కొరడా ఝులిపిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సారైనా రమణమ్మ సమస్యకు పరిష్కారం లభించేనా? పాత పరిస్థితో కొనసాగేనే? వేచిచూడాల్సిందే..



# ఘనంగా నాగుల పంచమి

- ఉర్సు నాగమయ్య గుడికి పోటెత్తిన భక్తులు
- జిల్లా వ్యాప్తంగా వేడుకలు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నాగుల పంచమి సందర్భంగా ఉర్సు నాగమయ్య గుడికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే వేలాదిగా తరలి క్యూ కట్టారు. జంట నాగులకు పాలుపోసి భక్తి పారవశ్యంలో మునిగితేలారు. కోరిన కోర్కెలు నెరవేర్చుతూ భక్తుల కొంగు భంగారంగా వెలుగొందుతున్న నాగమయ్య దర్శనానికి రెండు, మూడు గంటలపాటు క్యూలైన్లలోనే వేచి ఉన్నారు. భక్తుల రాకను ముందుగానే గుర్తించిన ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలరు. మిల్స్ కాలనీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## శ్రీ కనకదుర్గ మాత దేవాలయంలో..

నాగుల పంచమి సందర్భంగా నర్సంపేట్ రోడ్ లోని శ్రీ కనకదుర్గ మాత దేవాలయంలోని నాగేంద్ర స్వామికి పాలు పోసి మొక్కులు సమర్పించుకున్నారు. కనకదుర్గ దేవాలయ కమిటీ అధ్యక్షులు మీసాల ప్రకాష్ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే నాగేంద్ర స్వామి పుట్టలో భక్తులు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వర శర్మ, ఆలయ కమిటీ సభ్యులు సింగిరికొండ వెంకటేశ్వర్లు, సర్వరియా సురేష్ కుమార్, పప్పు, వేణు, కొప్పుల శేఖర్, కొంక వెంకటేశ్వరరావు, జంగం ప్రభాకర్, గూడ శారద, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆలయంలో..

నాగుల పంచమి సందర్భంగా మంగళవారం 36 వ డివిజన్ పుప్పాల గుట్టలోని శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పుట్టలో పాలు పోసేందుకు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ ప్రకటించింది.








# రుణమాఫీకి సహకరించండి

- మంత్రి తుమ్మల, చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ కి వినతి
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న చేనేత కార్మికులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చేనేత కార్మికులకు ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీకి సహకరించాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ లను కలిసి విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ప్రభుత్వం చేనేత రుణమాఫీ కొరకు విధించిన నియమ నిబంధనలు కఠినంగా ఉండటం, బ్యాంకు అధికారులు సహకరించకపోవడంతో చేనేత కార్మికులు రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కఠిన నిబంధనలను సడలించాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు జరపాలని, కొత్త పాలకవర్గాన్ని నియమించాలని, చేనేత భరోసా పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని, ఎలాంటి కాలపరిమితి లేకుండా త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని నిరంతరం కొనసాగించాలని, ప్రతి జిల్లా కేంద్రంలో చేనేత వస్త్రాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞాపన పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బాసబత్తిని రాజేశం, ప్రధాన కార్యదర్శి చోళ రాజేశ్వర్, కోశాధికారి గవ్వల శంకర్, కోఆర్డినేటర్ గడ్డం వెంకటేశ్వర్లు, జాతీయ అధికార ప్రతినిధి రాపోలు జగన్, కోర్ కమిటీ సభ్యులు కర్నాటి మనోహర్, వేముల బాలరాజు, వాసా సతీష్ కుమార్, ఆడికి మల్లికార్జున్, చెరుకు స్వామి, నామాల శ్రీనివాస్ నేత, ఆర్య రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# బయో డిగ్రేబుల్ సంచులు వాడాలి

- ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయం ఇవే
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అవగాహన ర్యాలీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా బయో డిగ్రేబుల్ సంచులను వినియోగించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా హనుమకొండ పరిధి 59 వ డివిజన్ లో మంగళవారం శానిటేషన్ విభాగం నిర్వహించిన ర్యాలీలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 59వ డివిజన్ లోని ఎక్సైజ్ కాలనీ రైతు బజార్ మార్కెట్ ను ప్లాస్టిక్ రహిత మార్కెట్ గా తీర్చిదిద్దాలని వర్నరెబుల్ పాయింట్లలో చెత్త కనిపిస్తే జవాన్లకు పెనాల్టీలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ కాలనీ మార్కెట్ ను ప్లాస్టిక్ రహిత మార్కెట్ గా తీర్చిదిద్ది ఈ ప్రాంతంలో బయో డిగ్రేబుల్ ఉత్పతులకు అమ్మకానికి సంబంధించిన అవుట్ లెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి వంద శాతం చెత్త సేకరణ చేయాలన్నారు. డివిజన్ లో చెత్త లేకుండా ఎప్పటికపుడు తొలగించేలా ప్రణాళిక బద్ధంగా కార్యాచరణతో ముందుకు వెళ్లాలన్నారు. వంద శాతం పారిశుధ్య సిబ్బంది విధులకు హాజరు అయ్యేలా చూడాలని, యాజమాన్యాలు నిర్మాణ సంబంధ వ్యర్థాలు తొలగించకుంటే జరిమానా విధించాలన్నారు. జరిమానాలు విధించేందుకు తటపటాయించే జవాన్ల పైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, వెటర్నరీ వైద్యులు డాక్టర్ గోపాల్ రావు, హెచ్ఓ రమేష్, డీఈ సారంగం పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com